## ‘మహిళా పాలిటెక్నిక్’ అభివృద్ధికి తోడ్పడతా

వరంగల్, నవంబర్ 24 : నగరంలోని మహిళా పాలిటెక్నిక్ కళాశాల అభివృద్ధికి తనవంతు తోడ్పాటు అందిస్తానని పాలిటెక్నిక్ పూర్వ విద్యార్థుల నేత తవీ శ్రీనివాస్ అన్నారు. 1980లో ఏర్పాటైన మహిళా పాలిటెక్నిక్ కళాశాల 44 ఏళ్లు పూర్తి చేసుకున్న నేపథ్యంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఇప్పటివరకు మహిళా పాలిటెక్నిక్ కాలేజీలో చదువుకున్న విద్యార్థులతో జనవరి 4న పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించేందుకు నిర్ణయించారు. ఆయన మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే సహకారంతో పాలిటెక్నిక్ కాలేజీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. పాలిటెక్నిక్ సమస్యలపై విద్యార్థులు వినతిపత్రం అందజేశారు. ప్రిన్సిపాల్ రాంప్రసాద్, తెలంగాణ పాలిటెక్నిక్ విద్యార్థుల జేఏసీ రాష్ట్ర చైర్మన్ మేకల అక్షయ్‌కుమార్, పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధులు అనిత జయంతి, శెట్టిపల్లి సామ్య, రమాదేవి, పూర్వ ఉద్యోగులు వెంకటనారాయణ, మహేందర్ పాల్గొన్నారు.


పాలిటెక్నిక్ కళాశాలలో సమస్యలపై వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థులు

## పంటకు చీరె కట్టు!

శాయంపేట, నవంబర్ 24 : ఆరుగాలం కష్టించే రైతన్న చీరె కట్టు సాగును విస్తృతం చేస్తున్నారు. చీడపీడల నివారణతోపాటు కొందరు రైతులు దిష్టి తగలకుండా పంట చుట్టూ చీరలను కడుతున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. మండలంలోని ఆరెపల్లి శివారులో వంకాయ, బంతి తోట సాగు చేసిన రైతు పంట చుట్టూ ఇలా చీరలను కట్టడం ఆకట్టుకున్నది.

పంట చుట్టూ కట్టిన చీరలు



# ప్రమాదకరంగా కడిపికొండ ఆర్వోబీ

- గుబులు పుట్టిస్తున్న గుంతలు
- ప్రయాణం చేయాలంటే జంకుతున్న జనం
- మరమ్మతులపై దృష్టి పెట్టని పాలకులు, అధికారులు


బ్రిడ్జిపై అడుగడుగునా ఏర్పడిన గుంతలు


ధ్వంసమైన ఫుట్‌పాత్


విద్యుత్ స్తంభం వద్ద కరెంటు తీగలు

కాజీపేట, నవంబర్ 24 : కాజీపేట పట్టణంలోని కడిపికొండ ఆర్వోబీ రోడ్డు నిర్వహణ అధ్వాన్నంగా మారింది. దాదాపు రెండు దశాబ్దాల క్రితం 18 రైలు పట్టాల ప్రాంతాల ప్రజలు పట్టణానికి రాకపోకలు సాగించేందుకు వీలుగా అప్పటి జనాభాను దృష్టిలో పెట్టుకుని అధికారులు కడిపికొండ బ్రిడ్జిని నిర్మించారు. ప్రస్తుతం భారీ వాహనాల రద్దీతో ఇరుకుగా మారడం, బ్రిడ్జిపై అడుగడుగునా గుంతలు, ఇనుప రాడ్లు పైకి తేలి వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి వచ్చే భారీ లారీలు ఈ బ్రిడ్జి మీదుగానే వరంగల్, ఖమ్మం తదితర ప్రాంతాలకు వెళ్లేలా బైపాస్ రోడ్డును ఏర్పాటు చేశారు. దీంతోపాటు రాంనగర్, బోడగుట్ట, కడిపికొండ, తరాలపల్లి, అయోధ్యపురం, వెంకటాపూర్, ఐనవోలు, భట్టుపల్లి, కొండపర్తి తదితర గ్రామాల ప్రజలు, వాహనచోదకులు, ఆటోల్లో రాకపోకలు సాగిస్తారు. నిత్యం భారీ వాహనాల రాకపోకలతో బ్రిడ్జిపై గుంతలు ఏర్పడ్డాయి. గుంతలను తప్పించబోయి ముందు, ఎదురుగా వచ్చే వాహనాలు ఢీకొట్టుకుంటున్నాయి. రోజూ ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. బాపూజీనగర్ నుంచి రాంనగర్, కడిపికొండ, బోడగుట్ట, రాజీవ్ గృహకల్ప కాలనీకి వెళ్లే పాదచారుల కోసం ఏర్పాటు చేసిన ఫుట్‌పాత్ చాలా వరకు శిథిలావస్థకు చేరింది. ఆ ఫుట్‌పాత్‌పై వేసిన సిమెంట్ బిళ్లలు పగుళ్లు ఏర్పడ్డాయి. ఫుట్‌పాత్ ప్రాంతమంతా చెత్తాచెదారం, చెట్లతో నిండిపోయింది. విద్యుత్ స్తంభాలకు ఉన్న తీగలు చాలా వరకు పైకిపోయి ఫుట్‌పాత్‌పైనే దర్శనమిస్తున్నాయని ప్రజలు భయాభ్రాంతులకు గురవుతున్నారు. హైమాస్ట్ లైట్లు సరిగా వెలుగక పోవడంతో రాత్రి వేళల్లో గుంతలు కనిపించడం లేదని వాహన చోదకులు వాపోతున్నారు. తరుచూ ప్రమాదాలు జరుగుతున్నా ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికార యంత్రాంగం, పాలకులు స్పందించి ప్రమాదకరంగా మారిన గుంతలను పూడ్చాలని వాహన చోదకులు కోరుకుంటున్నారు.


బ్రిడ్జిపై ఏర్పడిన గుంతల నుంచి వెళ్తున్న వాహనదారులు

### గుంతలతో ఇబ్బందులు పడుతున్నాం..



కడిపికొండ ఆర్వోబీ అడుగడుగునా గుంతలమయంగా మారింది. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. భారీ వాహనాల రాకపోకలతో బ్రిడ్జి ఇరుకుగా మారింది. గుంతలతో వాహనాలు మరమ్మతులకు గురికావడమే కాకుండా ప్రమాదాలు జరిగి వాహనదారులు గాయాలపాలవుతున్నారు. అధికారులు మరమ్మతులు చేపట్టాలి.

– చెన్నబోయిన మధు, వాహనదారుడు కడిపికొండ

### అధికారులు పట్టించుకోవాలి



కడిపికొండ బ్రిడ్జిపై ప్రయాణం వాహనదారులకు నరకంగా మారింది. బ్రిడ్జి పైనుంచి భారీ వాహనాలు పోతుంటాయి. గుంతలు ఏర్పడి ముందు వాహనం సడన్‌గా ఆగితే వెనుక వాహనాలు పల్టీలు కొట్టి ప్రమాదాల బారిన పడుతున్నారు. పాలకులు, అధికారులు బ్రిడ్జికి మరమ్మతులు చేపట్టి పాదచారులను నరకం నుంచి తప్పించాలి.

– మథిన్, స్థానికుడు రాంనగర్

## నేడు బల్దియా గ్రీవెన్స్

వరంగల్, నవంబర్ 24 : గ్రేటర్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్ సెల్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30గంటలు నుంచి గ్రీవెన్స్‌లో ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరిస్తామని చెప్పారు. స్థానిక సమస్యల పరిష్కారం కోసం వినతులు అందజేయాలన్నారు. అధికారులు సకాలంలో గ్రీవెన్స్‌కు హాజరుకావాలన్నారు.

## అదాలత్ జంక్షన్‌లో తప్పిన ప్రమాదం

హనుమకొండ, నవంబర్ 24 : అదాలత్ జంక్షన్ వద్ద కర్రల లోడ్‌తో వెళ్తున్న లారీకి పెను ప్రమాదం తప్పింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం తెల్లవారు జామున భారీ కర్రల లోడుతో హైదరాబాద్‌కు వెళ్తున్న లారీ నుంచి ఒక్కసారిగా కర్రలు కిందపడ్డాయి. ఆ సమయంలో అక్కడ వాహనాలు, మనుషులు లేకపోవడంతో ఎలాంటి ప్రమాదం జరగలేదని స్థానికులు తెలిపారు. అధిక లోడ్ వల్ల ఈ ప్రమాదం జరిగిందని, ఇలాంటి లారీలపై సంబంధిత శాఖల అధికారులు దృష్టి పెట్టి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


లారీ నుంచి కిందపడ్డ కర్రలు

## ఓటు హక్కు నమోదు చేసుకోవాలి

దామెర, నవంబర్ 24 : మండలంలోని ఊరుగొండ, దామెర, పులుకుర్తి, కోగిల్వాయి గ్రామాల్లో ప్రత్యేక ఓటు హక్కు నమోదు క్యాంపెయిన్‌ను అధికారులు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ మురళి మాట్లాడుతూ.. జనవరి 1వ తేదీ నాటికి 18 సంవత్సరాలు నిండిన యువత ఓటు హక్కు నమోదుకు అర్హులన్నారు. వీరందరూ తప్పకుండా తమ ఓటు హక్కును గ్రామాల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక క్యాంపుల్లో నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బీఎల్‌వోలు విజయ, సుజాత, విజిత, కోమల, రజిత, వనజ పాల్గొన్నారు.

## ఎన్‌ఎంఎంఎస్ పరీక్షలు ప్రశాంతం

హనుమకొండ చౌరస్తా, నవంబర్ 24 : నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్‌ఎంఎంఎస్) పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా జరిగినట్లు జిల్లా విద్యాశాఖాధికారి వాసంతి తెలిపారు. ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు హనుమకొండ రెవెన్యూ డివిజన్‌లో 3 పరీక్ష కేంద్రాల్లో, పరకాల రెవెన్యూ డివిజన్‌లో ఒక కేంద్రంలో పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ పరీక్షకు 628 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 593 మంది(94 శాతం) మాత్రమే పరీక్షకు హాజరయ్యారని, 35 మంది హాజరుకాలేదన్నారు.

## ధాన్యాన్ని ఆరబెట్టుకోవాలి

శాయంపేట, నవంబర్ 24 : ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తెచ్చే రైతులు 17 శాతం తేమ వచ్చేవరకు ఆరబెట్టుకోవాలని తహసీల్దార్ సత్యనారాయణ సూచించారు. మండలంలోని జోగంపల్లి, మైలారం గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆదివారం సందర్శించారు. పొలాల్లోనే ధాన్యాన్ని తూర్పార పట్టాలని, 17 శాతం తేమ వచ్చేవరకు ఆరబెట్టుకోవాలన్నారు. మిల్లర్ల వద్ద సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. లారీలను సకాలంలో తీసుకొచ్చి మిల్లులకు తరలించాలని సూచించారు. లారీ ఓనర్లు సమస్యలు సృష్టిస్తే తమకు తెలపాలన్నారు. కాగా,

**ఓటర్ నమోదు కేంద్రాలు తనిఖీ**

మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఓటరు నమోదు ప్రత్యేక కేంద్రాలను తహసీల్దార్ సత్యనారాయణ పరిశీలించారు. జనవరి ఒకటి నాటికి 18 సంవత్సరాలు నిండిన వారు ఫామ్-6 ద్వారా దరఖాస్తు చేయాలన్నారు. బీఎల్‌వోలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏఆర్ఐ రమేశ్, సీనియర్ అసిస్టెంట్ అచ్చారావు పాల్గొన్నారు.


కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ సత్యనారాయణ

## రుద్రేశ్వరస్వామికి అన్నపూజ

హనుమకొండ చౌరస్తా, నవంబర్ 24 : చారిత్రక వేయి స్తంభాల దేవాలయంలో రుద్రేశ్వర స్వామికి 51 కిలోల పెరుగన్నంతో అలంకరించారు. స్వామివారిని ఆదివారం ఉజ్జయిని మహాకాళేశ్వరగా అలంకరించినట్లు ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ తెలిపారు. అనంతరం భక్తులకు ప్రసాదం అందజేశారు. సోమవారం మారేడు దళ బిల్వార్చన, కార్తీక వనభోజనాలు, కార్తీక సమారాధన నిర్వర్తించనున్నట్లు తెలిపారు.


రుద్రేశ్వరస్వామికి 51 కిలోల పెరుగన్నంతో మహాఅన్నపూజ

## మాలల సింహగర్జన పోస్టర్ ఆవిష్కరణ

హసన్‌పర్తి, నవంబర్ 24 : హైదరాబాద్‌లో డిసెంబర్ 1న నిర్వహించే హలో మాల చలో హైదరాబాద్.. మాలల సింహగర్జన సభను జయప్రదం చేయాలని మండలాధ్యక్షుడు పోతరాజు ప్రభాకర్ ఆధ్వర్యంలో ఆదివారం మండల కేంద్రంలో పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ వద్దని, ఎస్సీలందరూ కలిసుండి 15 శాతం ఉన్న రిజర్వేషన్‌ను 25 శాతం వరకు పెంచుకునేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని సూచించారు. అలాగే మాలలు అధిక సంఖ్యలో పాల్గొని మాలల సింహగర్జన సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రమేశ్, గణేశ్, గణపతి, శ్రీకాంత్ పాల్గొన్నారు.


హసన్‌పర్తిలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రభాకర్, నాయకులు

# కేయూ ఇంటర్ కాలేజియేట్ క్రికెట్ విజేత వాగ్దేవి

**రన్నర్ ఆర్ట్స్ కాలేజీ జట్టు**

హనుమకొండ చౌరస్తా, నవంబర్ 24 : కాకతీయ యూనివర్సిటీ ఇంటర్ కాలేజియేట్ క్రికెట్ పురుషుల టోర్నమెంట్ విజేతగా కిషన్‌పురలోని వాగ్దేవి డిగ్రీ అండ్ పీజీ కళాశాల జట్టు నిలవగా, యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీ జట్టు రన్నర్‌గా నిలిచింది. యూనివర్సిటీ మైదానంలో క్రికెట్ పోటీలు ఆదివారం ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రిజిస్ట్రార్ మల్లారెడ్డి, విశిష్ట అతిథిగా స్పోర్ట్స్ బోర్డ్ సెక్రటరీ వెంకయ్య, వాగ్దేవి డిగ్రీ అండ్ పీజీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ హరేందర్‌రెడ్డి, కొమురారెడ్డి బహుమతులు ప్రదానం చేశారు. ఆర్గనైజింగ్ సెక్రటరీ మహ్మద్ అఫ్జల్, ఫిజికల్ డైరెక్టర్స్ భాస్కర్, మధుకర్, పల్లెపు కిషన్, బత్తిని జీవన్, మోహనకృష్ణ, రాము, మట్టెడ కుమార్, మహ్మద్ అస్లాం, ఎంపైర్స్‌గా బండారి ప్రభాకర్, వేల్పుల సురేశ్ పాల్గొన్నారు.

ఫైనల్ మ్యాచ్‌లో టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన వాగ్దేవి డిగ్రీ అండ్ పీజీ కాలేజ్ జట్టు 20 ఓవర్లలో 183 పరుగులు చేసింది. జాకబ్ 33బంతుల్లో 43 పరుగులు, శివరాం 35బంతుల్లో 42 పరుగులు చేశాడు. ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ బౌలర్ రాజేందర్ 2వికెట్లు తీశాడు. తర్వాత బ్యాటింగ్ చేసిన ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ జట్టు 20 ఓవర్లలో 127 పరుగులకు 6 వికెట్లు కోల్పోయి ఓటమిపాలైంది. సందీప్ 31 పరుగులు, కల్యాణ్ 26 పరుగులు చేశాడు. వాగ్దేవి డిగ్రీ అండ్ పీజీ కళాశాల జట్టు 56 పరుగుల తేడాతో విజయం సాధించింది. వాగ్దేవి కళాశాల యాజమాన్యం సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ చందుపట్ల దేవేందర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ శేషాచలం క్రీడాకారులను అభినందించారు.


విజేత వాగ్దేవి కాలేజీ జట్టుతో..


రన్నర్స్‌గా ఆర్ట్స్ కాలేజీ జట్టు

# అయ్యప్ప ఆలయంలో నేటి నుంచి అన్నదానం

కాజీపేట, నవంబర్ 24 : కాజీపేట రైల్వే దేవాలయ సముదాయంలోని హరిహర పుత్ర ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి ఆలయంలో సోమవారం నుంచి అయ్యప్పస్వామి మాలధారులకు నిత్యాన్నదానం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సెక్రటరీ బుర్ర జనార్దన్ గౌడ్ తెలిపారు. ఆలయంలో జరుగుతున్న అయ్యప్పస్వామి 30వ మండల పూజా మహోత్సవంలో భాగంగా డిసెంబర్ 25వ తేదీ వరకు ప్రతి రోజు భిక్ష ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రతి రోజు దేవాలయ ప్రాంగణంలో ఉదయం టోకెన్లు ఇస్తామని, అయ్యప్పస్వాములు తప్పనిసరిగా టోకెన్ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆలయ పూజారి ఉడుతల శ్రీనివాస్‌శర్మ, మాలధారులు పిల్లల కుమారస్వామి, ఆవాల పురుషోత్తం రెడ్డి, పాక శ్రీనివాస్, వంగాల నళినీకాంత్, దేగల శ్రీధర్, పాము రాజేశ్ కుమార్, బాలకృష్ణ పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

సెప్టిక్ ట్యాంక్ క్లినర్

SepTeK

★ సెప్టిక్ ట్యాంక్ క్లినర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు. Cont: 9849145043, 9866584455.
NTW-326503

CHANGE OF NAME

★I, MOHAMMED IMTIAZ ALI (Old Name) H.No: 3-4-582, Sudhanagar Street, Hanamkonda. Dist Pin-506001. TG, Here by declare that. I have changed my name MOHD IMTIAZ ALI (New Name) for all purpose.
NTW-000

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777961
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హనుమకొండ, నవంబర్ 24 : హనుమకొండ టౌన్ పరిధిలో పలు ప్రాంతాల్లో సోమవారం విద్యుత్ సరఫరాలోఅంతరాయం ఉంటుందని ఆపరేషన్స్ డీఈ సాంబారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అభివృద్ధి పనుల నేపథ్యంలో సోమిడి సబ్‌స్టేషన్ పరిధిలోని వెంకటాద్రినగర్, విష్ణుపురి 11కేవీ ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు కాజీపేట పోలీస్‌స్టేషన్, విష్ణుపురి వాటర్ ట్యాంక్, కాజీపేట మెయిన్‌రోడ్డు, ట్రూ వాల్యూ డీటీఆర్ పక్కన, డీమార్ట్ షాపింగ్ మాల్, రహ్మత్ నగర్ ఏరియాల్లో విద్యుత్ నిలిపివేస్తున్నట్లు తెలిపారు. ఆయా ప్రాంతాల ప్రజలు సహకరించాలని ఆ ప్రకటనలో కోరారు.

## అప్పుల బాధతో పెయింటర్ ఆత్మహత్య

ఐనవోలు, నవంబర్ 24 : అప్పుల బాధతో పెయింటర్ ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన జరిగింది. ఎస్సై పస్తం శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కొండపర్తి గ్రామానికి చెందిన మాచర్ల బాలరాజ్(45) పెయింటింగ్ పని చేస్తూ జీవనం సాగిస్తుండేవాడు. ఈ క్రమంలో కుటుంబ నిర్వహణ కోసం అప్పులు అయ్యాయి. చేసిన అప్పులు తీర్చడానికి తనకున్న భూమిని అమ్ముకున్నాడు. కానీ అనారోగ్యానికి గురికావడంతో చికిత్స, కుటుంబ పోషణ కోసం మరికొన్ని అప్పులు చేయాల్సి వచ్చింది. బాలరాజ్‌కు భార్య శ్రీలత, కుమార్తె అఖిల ఉంది. అప్పులు ఎలా తీర్చాలో తెలియడం లేదని భార్యతో తరుచూ చెబుతూ బాధపడేవాడు. ఈ క్రమంలో శనివారం మధ్యాహ్నం బాలరాజ్ ఇంట్లో నుంచి వెళ్లి తిరిగి రాలేదు. ఆదివారం ఉదయం కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఇంటి చుట్టు పక్కన వెతకగా, ఇంటి వెనుకల ఉన్న వేప చెట్టుకు ఉరేసుకొని విగతజీవిగా కనిపించాడు. భార్య శ్రీలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.


బాలరాజ్(ఫైల్)

# వరికోత యంత్రాల కొరత

- ఆలస్యంతో పడిపోతున్న దిగుబడి
- భారీగా పెరిగిన ధరలతో రైతుల బెంబేలు
- మధ్యవర్తులను ఆశ్రయిస్తున్న రైతులు

శాయంపేట నవంబర్ 24 : వరి కోత రైతులకు కడుపుకోతను మిగులుస్తున్నది. దాదాపు 20 రోజుల నుంచి వరి కోతలకు హార్వెస్టర్లు దొరక్కపోవడం రైతులను కుంగదీస్తున్నది. సకాలంలో వరి కోతలు జరగకపోవడంతో వరి పంట ఎండిపోయి నేల వాలుతున్నదని రైతులు వాపోతున్నారు. ఈ పరిస్థితుల్లో మూలిగే నక్కపై తాటి పండు పడిన చందంగా హార్వెస్టర్ల ధరలను పెంచడం రైతులకు తలకు మించిన భారంగా మారింది. దీంతో మధ్యవర్తులను ఆశ్రయించి హార్వెస్టర్ల ఓనర్లను బతిలాడి రైతులు కోతలు చేపడుతున్న పరిస్థితి నెలకొంది. మండలంలో సుమారు 8వేల ఎకరాలకుపైగా వరి సాగయింది. అయితే కోతకు ఎప్పుడో సిద్ధమైనప్పటికీ హార్వెస్టర్ల కొరతతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో నల్లగొండ, కరీంనగర్, హుజూరాబాద్ వంటి ప్రాంతాల నుంచి వరి కోతలకు ముందే హార్వెస్టర్లు మండలానికి వచ్చేవని రైతులు చెబుతున్నారు. అయితే ఈ సారి అక్కడా కూడా వరి కోతలు జరుగుతూ ఉండడంతో మండలానికి హార్వెస్టర్లు రాలేదు. ఈ నేపథ్యంలో గ్రామాల్లో ఉన్న మధ్యవర్తుల ద్వారా హార్వెస్టర్లను తీసుకొచ్చుకుంటున్నారు. అయితే ఇక్కడ హార్వెస్టర్లు అందుబాటులో లేకపోవడంతో నెల్లూరు తదితర ప్రాంతాల నుంచి మధ్యవర్తులు రూ.200 తీసుకుని తెస్తున్నారు. గతంలో హార్వెస్టర్లకు గంటకు రూ.2వేలలోపు చెల్లించగా, ఈ సారి రూ.2500 పెంచినట్లు వాపోతున్నారు. చైన్ హార్వెస్టర్ గతంలో రూ.2800కు రాగా ఇప్పుడు రూ.3600 పెంచినట్లు చెప్పారు. దీంతో ఒక్కో ఎకరానికి సుమారు రూ.5వేలకు పైగా ఖర్చు చేయాల్సి వస్తున్నదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే రోజుకు ఒక్క వరి కోత యంత్రం సుమారు 7 గంటలు మాత్రమే పని చేస్తుందని చెబుతున్నారు. ఈ క్రమంలో వరి కోత ఉన్న రైతులు కోత మిషన్ల కోసం వెంపర్లాడుతున్నారు. తమకు పంపించాలని ముందస్తుగా ఒప్పందాలు చేసుకుంటూ అడ్వాన్సులు చెల్లిస్తున్నారు.


సూరంపేటలో వరి కోస్తున్న హార్వెస్టర్

## చికిత్స పొందుతూ వివాహిత మృతి

ఐనవోలు, నవంబర్ 24 : చికిత్స పొందుతూ వివాహిత మృతి చెందిన ఘటన జరిగింది. ఎస్సై పస్తం శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని నర్సింహులగూడెం గ్రామానికి చెందిన మమత(38)కు కట్కూరి కృష్ణతో 2006లో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ క్రమంలో మమత అనారోగ్యానికి గురైంది. చికిత్స కోసం ఎన్ని హాస్పిటల్స్‌కు తిరిగినా తగ్గకపోవడంతో మనస్తాపం చెందిన మమత ఈ నెల 19న పురుగుల మందు తాగింది. దీంతో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు చికిత్స కోసం ఎంజీఎం దవాఖానలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. భార్త కృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.


మమత(ఫైల్)

## మెట్టుగుట్టపై మహా రుద్రాభిషేకం

మడికొండ, నవంబర్ 24: తెలంగాణ రైల్వే ఎంప్లాయిస్ జేఏసీ ఆధ్వర్యంలో మడికొండ మెట్టుగుట్ట సీతారామచంద్రస్వామి, స్వయంభూ లింగేశ్వరస్వామి ఆలయ ఆవరణలో మహా రుద్రాభిషేకం, హోమం నిర్వహించారు. రైల్వే వ్యాగన్ మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్, కోచ్ ఫ్యాక్టరీ, కాజీపేట రైల్వే డివిజన్ నిర్మాణ పనులు ఎలాంటి ఆటంకాలు లేకుండా దేవతామూర్తుల అనుగ్రహంతో సకాలంలో పూర్తి కావాలని ఆకాంక్షిస్తూ ప్రత్యేక పూజలు చేపట్టారు. అలాగే రైల్వేకు ఆలయ భూములను అప్పగించిన గత బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు దేవులపల్లి రాఘవేందర్, చైర్మన్ కొండ్ర నర్సింగరావు, వైస్ చైర్మన్లు గుర్రపు సుధాకర్‌రావు, రమేశ్, రాజేశ్వర్ రావు, రవీందర్, మూర్తి, శివ, కో కన్వీనర్లు మాధవరావు, అనుమాల శ్రీనివాస్, నగేశ్, భాస్కర్, సంపత్ పాల్గొన్నారు.

# 30 నుంచి ఐఏఎల్ రాష్ట్ర మహాసభలు

హనుమకొండ, నవంబర్ 24 : హనుమకొండలో ఈ నెల 30, డిసెంబర్ 1వ తేదీల్లో జరుగనున్న భారత న్యాయవాదుల సంఘం (ఐఏఎల్) తెలంగాణ రాష్ట్ర ద్వితీయ మహాసభలను జయప్రదం చేయాలని ఐఏఎల్ జాతీయ ప్రధాన కార్యదర్శి బొమ్మగాని ప్రభాకర్ కోరారు. ఆదివారం ఐఏఎల్ రాష్ట్ర మహాసభల ఆహ్వాన సంఘ చైర్మన్, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు దుస్సా జనార్దన్ అధ్యక్షతన నక్కలగుట్టలోని హరిత హోటల్‌లో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1983లో భారతదేశం గర్వించదగిన న్యాయమూర్తులు వీఆర్ కృష్ణ అయ్యర్, పీఎస్ భగవతి, డీఏ దేశాయ్, చిన్నపరెడ్డి తదితరులు ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్‌ను స్థాపించారని తెలిపారు. దేశంలో న్యాయవాదులపై దాడులు రోజురోజుకూ పెరుగుతున్నాయని, న్యాయవాదులకు రక్షణ చట్టాలు అమలు చేయాలని కోరారు. జూనియర్ న్యాయవాదులకు స్టైఫండ్, హౌసింగ్ స్కీమ్, వృద్ధాప్యంలోకి ప్రవేశించిన సీనియర్ న్యాయవాదులకు సమగ్ర ఆరోగ్య పథకం, సంక్షేమ నిధి పెంపు వంటి చర్యలు ప్రభుత్వం తీసుకోవాలని అన్నారు. శాసనమండలిలో న్యాయవాదులకు ప్రత్యేక నియోజకవర్గం ఏర్పాటు చేయాలని, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ వర్గాలకు చెందిన జూనియర్ న్యాయవాదులకు లైబ్రరీ, కంప్యూటర్ కోసం ఆర్థిక సహకారం అందించాలన్నారు. సెక్షన్ 35 భారతీయ నాగరిక సురక్ష సన్నిహిత 41 ఏసీఆర్‌పీసీ సవరణ ద్వారా ప్రజలకు మేలు జరగకపోగా మరింత నష్టం వాటిల్లుతుందని, దీనిపై పార్లమెంట్ పునఃసమీక్ష చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. మహాసభల ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి భీమనాథం శ్రీనివాస్, ఉపాధ్యక్షులు ప్రేమ్‌సాగర్‌రావు, వలస సుధీర్, బిల్ల ప్రభాకర్, ట్రెజరర్ గంజి గణేశ్, సహాయ కార్యదర్శి వలీఉల్లాఖాద్రి, ప్రచార కమిటీ కోఆర్డినేటర్స్ కొత్తపల్లి చిరంజీవి, మేరుగు సుభాష్, కమిటీ సభ్యులు సత్యనారాయణ, దిలీప్, భాను కార్తీక్, కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న బొమ్మగాని ప్రభాకర్

# ప్రొఫెసర్ సాయిబాబా ఆశయాలను కొనసాగించాలి

హనుమకొండ, నవంబర్ 24 : ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబా ఆశయాలను కొనసాగిద్దామని ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. ప్రజాస్వామిక, వామపక్ష, లౌకికవాదులు, ప్రజా సంఘాల ఐక్య వేదిక ఉమ్మడి వరంగల్ జిల్లా ఆధ్వర్యంలో ఆదివారం ఆర్ట్స్ కళాశాల ఆడిటోరియంలో ఘంటా రాంరెడ్డి అధ్యక్షతన ప్రొఫెసర్ సాయిబాబా సంస్మరణ సభ జరిగింది. వెంగల్‌రెడ్డి కార్యనిర్వాహక కార్యదర్శిగా వ్యవహరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ శక్తులకు వత్తాసు పలికే పాలకులే ప్రొఫెసర్ సాయిబాబాను హత్య చేశారన్నారు. ప్రొఫెసర్ కాత్యాయిని మాట్లాడుతూ.. ‘పుట్టుక నీది చావు నీది బతుకంతా దేశానిది’ అన్న కాళోజీ మాటలు ప్రొఫెసర్ సాయిబాబాకు అక్షరాలా వర్తిస్తాయన్నారు. మా భూమి సంధ్య, సారయ్య, రామంచ భారత్ పాడిన పాటలు సభికులను ఆకట్టుకున్నాయి. సాయిబాబాపై కవి శోభా రమేశ్ రాసిన డాక్యుమెంటరీ పాటను సాయిబాబా కూతురు మంజీరా ఆవిష్కరించారు. వీక్షణం ఎడిటర్ ఎన్ వేణుగోపాల్, సామాజిక విశ్లేషకుడు రవిచందర్, సీపీఎం జిల్లా కార్యదర్శి బొట్ల చక్రపాణి, అరసం రాష్ట్ర అధ్యక్షుడు పల్లేరు వీరస్వామి, లాల్ నీల్ మైత్రి వేదిక రాష్ట్ర నాయకుడు మార్క శంకర్‌నారాయణ, భారత్ బచావో జిల్లా చైర్మన్ సిద్దోజు రామబ్రహ్మం, డీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లింగారెడ్డి, పౌరహక్కుల సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షుడు రమేశ్‌చంద్ర పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

**మీ సేవలో నగదు చెల్లింపులు ఉండాలి**

మీ సేవలో నగదు చెల్లింపులు ఉండే విధానాన్ని అమలు చేయాలని మీ సేవ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రావిపాటి దేవేందర్‌రావు, ప్రతినిధులు శ్రీధర్, శివకుమార్ ఎమ్మెల్యే నాయినిని కలిసి వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వం మీ సేవలో క్యూ ఆర్ కోడ్ ద్వారా డబ్బులు చెల్లించాలని వార్తా ప్రతికల్లో వచ్చిందని, దీంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడే అవకాశం ఉందన్నారు.

**సెయింట్ జోసెఫ్ స్కూల్‌లో జాతీయ స్థాయి సాహిత్య పోటీలు**

హనుమకొండ చౌరస్తా : హనుమకొండ కుమారపల్లిలోని సెయింట్ జోసెఫ్ పాఠశాలలో ఆదివారం జాతీయ స్థాయి సాహిత్య పోటీలు నిర్వహించారు. ఎలక్యూషన్, ఎస్సే రైటింగ్, క్విజ్, మాక్ పార్లమెంట్, డాక్యుమెంటరీ, స్పెల్ బీ, లైవ్ రిపోర్టింగ్ వంటి 12 విభాగాల్లో జరిగిన పోటీల్లో పాల్గొని మెరుగైన ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ, ప్రోత్సాహక బహుమతులను ఎమ్మెల్యే నాయిని రాజేందర్, కార్పొరేటర్ పోతుల శ్రీమన్నారాయణ అందజేశారు. పాఠశాల కరస్పాండెంట్ సిస్టర్ బోయపాటి ఫాతిమా, ప్రిన్సిపాల్ సిస్టర్ మేరీజయకు సిస్టర్స్ ఆఫ్ సెయింట్ ఆన్ పోలిరెడ్డి ఆల్ఫోన్స్ అభినందనలు తెలిపారు.